www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 17 ఆగస్టు 2024

5

ఏలూరు

జిల్లాస్థాయి పోటీల్లో శరణ్యకు ద్వితీయ బహుమతి

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని జిల్లాస్థాయిలో 'బాలల హక్కులు, బాల్యవివాహాలు, బాల కార్మిక నిర్మూలన, బాలల రక్షణ' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం హైస్కూల్‌కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని సిరిబత్తిన శరణ్య జూనియర్స్ విభాగంలో ద్వితీయ బహుమతి సాధించింది. శరణ్య జిల్లా కలెక్టర్ బంగ్లాలో గురువారం రాత్రి జరిగిన హై-టీ కార్యక్రమంలో కలెక్టర్ వెట్రిసెల్వి చేతుల మీదుగా మెమెంటో, ప్రశంసాపత్రం అందుకున్నారు. జిల్లా ఎస్పి ప్రతాప్ శివకిషోర్, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి శరణ్యను అభినందించారు.

శరణ్యకు సర్టిఫికెట్ అందిస్తున్న కలెక్టర్, జెసి

'అన్నదాత సుఖీభవ' అందేదెప్పుడో..!

- ఖరీఫ్ పెట్టుబడుల కోసం రైతాంగం అవస్థలు
- ఏడాదికి రూ.20 వేలు అందిస్తామని టిడిపి కూటమి హామీ
- నేటికీ విధివిధానాలపై ప్రకటన చేయని పరిస్థితి
- ఎన్ని విడతలుగా ఇస్తారో తెలియక గందరగోళం
- గత ప్రభుత్వంలో రెండు జిల్లాల్లో దాదాపు 2.50 లక్షల మందికి రైతుభరోసా
- ఈసారైనా కౌలురైతులకు ప్రభుత్వ సాయం అందేనా?

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండు నెలలు గడిచిపోయింది. రైతులకు పెట్టుబడి సాయం కింద ఇస్తామన్న రూ.20 వేల హామీపై సర్కార్ నోరు మెదపడం లేదు. విధివిధానాలు సైతం ఖరారు చేయలేదు. దీంతో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం ప్రకటించిన 'అన్నదాత సుఖీభవ' అందేనా అనే అనుమానం రైతుల్లో నెలకొంది. ఇప్పటికే వరదలకు తీవ్ర నష్టాలను చవిచూసిన రైతులు ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారు. రెండు జిల్లాల్లో అత్యధికంగా కౌలురైతులు ఉండటంతో ఈ ప్రభుత్వంలోనైనా వారికి పెట్టుబడి సాయం అందేనా అనే చర్చ సాగుతోంది.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గత ప్రభుత్వంలో పెట్టుబడి సాయం కింద రైతులకు రైతుభరోసా పేరిట ఏడాదికి రూ.13,500 అందించింది. దీనిలో రూ.ఆరు వేలు కేంద్రం, రూ.7,500 రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చింది. కేంద్రం సొమ్ము ఏడాదిలో మూడు విడతలుగా జమైతే, రాష్ట్రప్రభుత్వం మే చివరి వారంలో మొదటివిడతగా రూ.5,500, రెండోవిడతగా జనవరిలో రూ.రెండు వేలు అందించేది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు 2.50 లక్షల మంది రైతులు రైతుభరోసా అందుకున్నారు. తాము అధికారంలోకి వస్తే పెట్టుబడి సాయం రూ.20 వేలకు పెంచుతామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీంతో రైతులు ఎంతగానో సంబరపడ్డారు. అధికారం చేపట్టాక 'అన్నదాత సుఖీభవ' పేరుతో పెట్టుబడి సాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఖరీఫ్ సాగు ప్రారంభమై నెలలు గడిచిపోతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు పెట్టుబడి అత్యంత అవసరం. కూటమి ప్రభుత్వం మాత్రం ఇప్పటి వరకూ పెట్టుబడి సాయం కింద అందించే రూ.20 వేలు గురించి నోరువిప్పడం లేదు. ఇప్పటి వరకూ 'అన్నదాత సుఖీభవ' అమలుకు సంబంధించిన విధివిధానాలపై ఆదేశాలు సైతం ఇవ్వలేదు. అందించే రూ.20 వేలు పెట్టుబడి సాయం ఎన్నివిడతలుగా ఇస్తారో కూడా తేలని పరిస్థితి. దీంతో పెట్టుబడి సాయంపై రెండు జిల్లాల రైతాంగంలో పెద్దఎత్తున చర్చ సాగుతోంది. ఇటీవల విరుచుకుపడిన వరదలు, భారీ వర్షాలకు ఖరీఫ్ పంట దెబ్బతింది. రెండు జిల్లాల్లో 30 వేలకుపైగా నాట్లు నాటిన పొలాలు, దాదాపు 1600 ఎకరాల్లో నారుమడులు దెబ్బతిన్నాయి. రైతులు ఎకరాకు రూ.15 వేల వరకూ నష్టపోయారు. రైతులు రెండోసారి నారుమడులు, నాట్లు వేయాల్సిన పరిస్థితి. దీంతో పెట్టుబడి అదనంగా వెచ్చించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. నాట్లు వేసి 30 రోజులు పూర్తి కాలేదనే కారణంతో ఇన్‌పుట్‌సబ్సిడీ జాబితాలో దెబ్బతిన్న పంటలను చేర్చని పరిస్థితి ఉంది. రెండుసార్లు పెట్టుబడి పెట్టాల్సి రావడంతో రైతులు ఆర్థికంగా నలిగిపోతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయం వెంటనే అందిస్తే రైతులకు ఎంతగానో మేలు జరుగుతోంది. దీనిపై ప్రభుత్వం నోరుమెదపకపోవడంతో ఖరీఫ్ సీజన్‌లో 'అన్నదాత సుఖీభవ' ఇచ్చే ఉద్దేశం ప్రభుత్వానికి ఉందా అనే అనుమానాలు నెలకొన్నాయి.

కౌలురైతులకు పెట్టుబడి సాయం అందేనా..?

రెండు జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నారు. జిల్లా వ్యవసాయ సాగులో 70 శాతానికిపైగా వీరే చేస్తున్నారు. గత ప్రభుత్వం రైతుభరోసా భూయజమానులకు తప్ప కౌలురైతులకు అందించలేదు. దీంతో కౌలురైతులు తీవ్రంగా నష్టపోయారు. పెట్టుబడి సాయం అనేది పెట్టుబడి పెట్టిన రైతులకు అందించాలి. సాగు చేస్తున్న కౌలురైతులు పెట్టుబడి పెడుతుండగా, ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం మాత్రం భూయజమానుల ఖాతాల్లో వేస్తున్నారు. దీనిపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. తాము అధికారంలోకి వస్తే కౌలురైతులను ఆదుకుంటామంటూ టిడిపి కూటమి చెప్పింది. 'అన్నదాత సుఖీభవ' కింద అందించే పెట్టుబడిసాయం కౌలురైతులకు అందించాలని అంతా కోరుతున్నారు. కౌలురైతులకు పెట్టుబడి సాయం అందేవిధంగా విధివిధానాలు ప్రకటించాలని కోరుతున్నారు. ప్రభుత్వం ఏవిధంగా ముందుకు సాగుతుందో వేచిచూడాలి.

నూజివీడులో అన్నక్యాంటీన్ ప్రారంభించి అల్పాహారం అందిస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి

అన్నార్తుల ఆకలి నింపడమే లక్ష్యం

- 'అన్న క్యాంటీన్ల ప్రారంభోత్సవంలో రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి
- రూ.లక్షా 25 వేలు విరాళంగా ప్రకటించిన ఎంఎల్ఎ బడేటి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

అన్నార్తుల ఆకలి నింపడమే 'అన్న క్యాంటీన్ల' ఏర్పాటు లక్ష్యమని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు పట్టణంలోని రామాయమ్మారావుపేటలో 'అన్న క్యాంటీన్'ను మంత్రి శుక్రవారం ప్రారంభించారు. ప్రజలకు దగ్గరుండి అల్పాహారం అందించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ కార్మికులు, ప్రజలు ఎన్నో పనుల మీద పట్టణాలకు వస్తుంటారని, అల్పాహారం, భోజనానికి రూ.వంద వరకూ ఖర్చవుతుంటాయన్నారు. అలాంటి పేదలకు రూ.5కే కడుపునిండా భోజనం అందించాలనేది ప్రభుత్వ ఉద్దేశమన్నారు. యువతకు అభిరుచి కలిగిన రంగంలో నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అన్ని రంగాల్లో నష్టపోయిన రాష్ట్రాన్ని అభివద్ధి గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. అనంతరం అన్న క్యాంటీన్లో అల్పాహారాన్ని మంత్రి ప్రజలతో కలిసి రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, డిఇ లక్ష్మినారాయణ, వార్డు కౌన్సిలర్ చెరుకూరి దుర్గాప్రసాద్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏలూరు సిటీ: పేదలకు పట్టెడన్నం పెట్టే ఆశయంతో కూటమి ప్రభుత్వం పయనిస్తోందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి తెలిపారు. సేవలందించేవారికి స్ఫూర్తిగా నిలిచేందుకు ఎంఎల్ఎగా తన తొలి నెల వేతనం రూ.లక్షా 25 వేలు అన్న క్యాంటీన్ల నిర్వహణకు విరాళమిస్తున్నానని ప్రకటించారు. శుక్రవారం ఏలూరు నగరంలో నాలుగు అన్న క్యాంటీన్లను ఎంఎల్ఎ బడేటి చంటి ప్రారంభించారు. దీనిలో భాగంగా తంగెళ్లమూడిలోని అన్నక్యాంటీన్‌ను కూటమి నేతలతో కలిసి ప్రారంభించిన ఆయన తొలుత ఎన్‌టి.రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం క్యాంటీన్‌లో పేదలతో కలిసి అల్పాహారాన్ని స్వీకరించారు. అనంతరం ఆర్ఆర్‌పేటలోని వెంకటేశ్వర స్వామి గుడి వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వితో కలిసి ఎంఎల్ఎ ప్రారంభించారు. అనంతరం బాలాజీ థియేటర్ వద్ద గల అన్న క్యాంటీన్‌ను టిడిపి జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుతో కలిసి ప్రారంభించారు. ఇండోర్ స్టేడియం వద్ద గల అన్నా క్యాంటీన్‌ను మేయర్ నూర్జహాన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ దాతృత్వం కలిగిన నేతలు, దాతలు సమాజాన్ని ముందుకు నడిపించేందుకు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ పేదలు పస్తులు ఉండకూడదనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లు పునరుద్ధరిస్తుందన్నారు. మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ ఎంఎల్ఎ బడేటి చంటి ఆదేశాల మేరకు కార్పొరేషన్ నిధులు రూ.36 లక్షలు కేటాయించి నగర పాలక సంస్థ పరిధిలోని మొత్తం నాలుగు అన్న కాంటీన్ల పునరుద్ధరణ పనులు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ చంద్రశేఖర్, మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు, నాయకులు పెద్దిబోయిన శివప్రసాద్, పూజారి నిరంజన్, నెరుసు గంగరాజు, ఆర్నేపల్లి తిరుపతి పాల్గొన్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి న్యూరో సర్జన్ డాక్టర్ బంక రవికుమార్ అన్న కాంటీన్ల నిర్వహణ కోసం రూ.లక్ష విరాళాన్ని ఎంఎల్ఎ బడేటి చంటికి అందించారు.

ఏలూరులో అన్న క్యాంటీన్ ప్రారంభించి అల్పాహారం అందిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎంఎల్ఎ బడేటి చంటి, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్.పెదబాబు

అన్న క్యాంటీన్ల నిర్వహణకు రూ.లక్ష విరాళం అందిస్తున్న ఏలూరు ప్రభుత్వాసుపత్రి న్యూరో సర్జన్ డాక్టర్ బంక రవికుమార్

పట్టణాల్లోనూ రెవెన్యూ సదస్సులు నిర్వహించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్లో నిర్వహించనున్న గ్రామ రెవెన్యూ సదస్సులు కేవలం గ్రామాల్లోనే కాకుండా పట్టణాల్లో కూడా నిర్వహించి భూసమస్యలు పరిష్కరించాలని, రాష్ట్ర రహదారులపై టోల్‌ఫీజు ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పవర్‌పేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశం తెల్లం రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథి సీతారాం మాట్లాడుతూ సెప్టెంబర్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న గ్రామ రెవెన్యూ సదస్సులను గ్రామాల్లోనే కాకుండా పట్టణాల్లో కూడా నిర్వహించాలన్నారు. బాధితుల దరఖాస్తులు స్వీకరించి, వాటిని పరిశీలించి తక్షణం భూసమస్యలను పరిష్కరించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే సిపిఎం జిల్లాలో అనేకచోట్ల భూపోరాటాలు నిర్వహిస్తున్నామని, ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల భూములు అన్యాక్రాంతమైపోయాయని ఆయన తెలిపారు. ఈ సదస్సుల్లో సిపిఎం కార్యకర్తలు దరఖాస్తులు పెట్టించి, భూసమస్యలను పరిష్కరించుకొనేలా కోరాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర రహదారులపై ప్రయాణించే వాహనాలకు టోల్‌ఫీజ్ వసూలు చేయాలన్న ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని ఆయన కోరారు. తక్షణం వెయ్యి కిలోమీటర్ల పరిధిలో టోల్ వసూలు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి కలెక్టర్లను ఆదేశించడం తగదన్నారు. భవిష్యత్తులో మొత్తం 12,650 కిలోమీటర్ల రాష్ట్ర రహదారులపై టోల్ వసూలు చేసే ప్రమాదముందన్నారు. రోడ్లను అభివృద్ధి చేయడం, వాటిని సక్రమంగా నిర్వహించడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత అని గుర్తు చేశారు. వాహనాల రిజిస్ట్రేషన్ సమయంలోనే లైఫ్ ట్యాక్స్, డీజిల్, పెట్రోల్, రోడ్ సెస్ తదితర రూపాల్లో ప్రభుత్వాలకు ఆదాయం సమకూరుతోందన్నారు. ఆ సొమ్ము ఆయా వాహన యజమానులు, వాటిలో ప్రయాణించేవారు ఇప్పటికే భరిస్తున్నారని, ఇప్పుడు జాతీయ రహదారులన్నింటిలో టోల్‌ట్యాక్సుల భారంతో రవాణా రంగం నష్టాల్లో ఉండగా పిపిపిల పేరిట రాష్ట్ర రహదారుల్లో ప్రతిపాదిత టోల్ ట్యాక్సు మోయలేని భారంగా మారి ప్రజలపై అదనపు భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర రహదారులపై టోల్‌ట్యాక్స్ ప్రతిపాదన వెంటనే విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వైద్య, ఆరోగ్య రంగ సమీక్ష సందర్భంలో నియోజకవర్గ ఆసుపత్రులు పిపిపి విధానంలో ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి వెల్లడించడం బాధాకరమన్నారు. దీనిఅర్థం పబ్లిక్ ప్రయివేటు పార్టనర్‌షిప్‌తో ప్రయివేటు రంగానికి ప్రభుత్వాస్పత్రులు ధారాదత్తం చేయడమేనని ఆయన విమర్శించారు. రెండు దశాబ్దాలుగా పిపిపి విధానం అమలు చేయడం వల్ల ప్రజలకు ఏరకమైన ప్రయోజనమూ కలగలేదని, ప్రభుత్వ రంగంలో వైద్య రంగం ఉంటేనే పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుతుందని ఆయన తెలిపారు. పిపిపి విధానం కేవలం ప్రయివేటు యాజమాన్యాల లాభాల కోసం ఉపయోగపడుతుందని అనుభవాలు చెబుతున్నాయన్నారు. అందుకే ఈ విధానం అమలు చేసే ఆలోచనను ప్రభుత్వం మానుకుని వైద్యఆరోగ్య రంగంలో పూర్తి బాధ్యత తీసుకుని వైద్య సిబ్బందిని, వసతులు పూర్తిగా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సందర్భంగా గుడివాడ రూరల్ పోలీసులు అర్ధరాత్రి సిపిఎం నాయకులను హౌస్‌అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. గత ప్రభుత్వ మాదిరికాకుండా నూతన ప్రభుత్వంలో ముందస్తు అరెస్టులు ఉండవని, ఆ విధంగా పోలీసులకు ఆదేశాలిస్తాం అని మంత్రి లోకేష్ ప్రకటించిన వారం రోజులకే మళ్లీ ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామికమన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని సీతారాం కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ ఉపాధి హామీ గ్రామ సభలు జరిపి, పనులకు నిధుల కేటాయింపు పెంచాలని, జాబ్‌కార్డులు పొందిన ప్రతి కుటుంబానికీ 200 రోజులు పని కల్పించాలని కోరుతున్నా వంద రోజులు పని కూడా కల్పించడం లేదన్నారు. కాంట్రాక్టర్లకు కేటాయించకుండా పనులను విస్తృతంగా చేపట్టి మరిన్ని ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికులు చేయగలిగిన 29 రకాల పనులు, కాలువల తవ్వకం, మట్టి తీయడం, జంగిల్ క్లియరెన్స్ వంటి పనులు ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తించాయని, ఆ ప్రకారం పనులు కల్పించాలని కోరారు. ఉపాధి హామీ పనుల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. కౌలురైతులందరికీ గుర్తింపు కార్డులిచ్చి, వడ్డీ లేని పంట రుణాలు ఇవ్వాలన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన సిపిఎం సీనియర్ నేత, నూజివీడు పట్టణ కమిటీ సభ్యులు వై.దుర్గారావు మృతి పట్ల సమావేశం సంతాపం తెలిపి నివాళులర్పించింది. సమావేశంలో ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్, జి.రాజు, పి.కిషోర్, ఎం.నాగమణి, వివిధ మండలాల నుండి వచ్చిన సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంతెన సీతారాం

15 శాతం వృద్ధి సాధించేలా జిల్లా ప్రణాళిక

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

2047 నాటికి అభివద్ధి చెందిన భారత్‌గా ఉండాలన్నదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యంలో భాగంగా రానున్న ఏడాదికి 15 శాతం వృద్ధి సాధించే దిశగా జిల్లా ప్రణాళిక సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని గౌతమి సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో వికసిత్ ఆంధ్రా-2047 జిల్లా యాక్షన్ ప్లాన్ 2024-29పై జిల్లా అధికారులతో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా 2047 నాటికి వికసిత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా జిల్లాకు చెందిన సమర్థవంతమైన ప్రణాళికతో అధికారులు పని చేయాలన్నారు. నీతిఆయోగ్ సహాయ సహకారాలతో నిర్ధేశిత లక్ష్యాలను నిర్ణయించుకుని అన్ని ప్రాథమిక రంగాల్లో అభివృద్ధికి వంద రోజులు, సంవత్సర ప్రణాళికలను తయారు చేసినట్లు తెలిపారు. 2047 నాటికి లక్ష్యాలను ఏర్పర్చుకుని అధిక వృద్ధి రేటు లక్ష్యంగా గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రణాళికలు రూపొందిస్తారన్నారు. జిల్లాలో జిడిపిని వృద్ధి చేసుకునేందుకు వ్యవసాయ, ఉద్యాన అనుబంధ, పారిశ్రామిక, పాలఉత్పత్తి, ఆక్వా, తదితర రంగాల ద్వారా మెండైన అవకాశాలు ఉన్నాయన్నారు. ఆయా వ్యవసాయ ఉత్పత్తుల విస్తరణ, ఉత్పత్తికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఆక్వాకు సంబంధించి మరింత నాణ్యమైన ఉత్పత్తులు అందించగలిగే దిశగా రైతులను ప్రోత్సహిస్తే మరింత జిడిపి వృద్ధి చెందుతుందన్నారు. పరిశ్రమలకు సంబంధించి ముఖ్యంగా పెద్ద ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ప్రోత్సహించాలన్నారు. మామిడి, కోకో, ఆయిల్‌పామ్ పంటలకు నెలవుగా ఉన్న జిల్లాలో అందుకు సంబంధించిన చాక్లెట్ తదితర పరిశ్రమలను నెలకొల్పే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పెద్ద పరిశ్రమల ఏర్పాటుకు అనువైన పరిస్థితులున్న దృష్ట్యా అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని చిన్నతరహా పరిశ్రమలను పెద్ద క్లస్టర్‌గా అనుసంధానం చేసి వారికి అవసరమైన రుణ సౌకర్యం కల్పించే దిశగా ఆలోచనలు చేయాలన్నారు. పాల ఉత్పత్తిలో రాష్ట్రంలో మూడోస్థానంలో ఉన్న జిల్లాను ప్రథమస్థానంలో ఉంచేందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలన్నారు. ద్వారకాతిరుమల వంటి ప్రసిద్ధక్షేత్రాలు సందర్శించిన పర్యాటకులకు జిల్లాలో ఇతర ప్రాంతాల్లో చూడదగిన అంశాలకు సంబంధించి ప్రత్యేక రూట్‌మ్యాప్‌ను రూపొందించాలన్నారు. ట్రైబల్ టూరిజాన్ని ప్రోత్సహించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక అవసరాలైన తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు, విద్య, ఆస్తుల నిర్వహణలో అందరికీ సముచిత న్యాయం జరగాలన్నదే లక్ష్యంగా పని చేయాలన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ, గిడ్డంగుల నిర్వహణ, పునరుత్పాదక ఇంధన వనరులు, వాణిజ్యపరంగా పర్యాటకాభివృద్ధి, వంటి నేపథ్య రంగాల్లో మండలాల భౌగోళిక, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా లక్ష్యాలను మండలాలవారీగా అధికారులు ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. జిల్లాలో అక్షరాస్యత శాతం పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పరిశ్రమలు, ఐటి రంగం అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు కూడా సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో వికసిత్ ఆంధ్రా-2047కు సంబంధించి 12 అంశాలకు సంబంధించిన జిల్లా ప్రాధాన్యతలపై సమీక్షించారు. అనంతరం క్షేత్రస్థాయిలో జిల్లా యాక్షన్‌ప్లాన్ 2024-29కు సంబంధించి తీసుకోవాల్సిన అంశాలపై గణాంకశాఖ సహాయ గణాంక అధికారులకు వివరించారు. ఈ వర్క్‌షాప్‌లో ఇన్‌ఛార్జి సిపిఒ బి.శ్రీదేవి, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు, డిపిఒ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, జెడ్‌పి సిఇఒ కెఎస్ఎస్.సుబ్బారావుతోపాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తల్లాపురంలో అంగన్‌వాడీ భవనం ప్రారంభం

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు మండలం తల్లాపురంలో రూ.9.50 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఎంఎల్ఎ ధర్మరాజు శుక్రవారం ప్రారంభించారు. ఉపాధి హామీ నిధులు రూ.5 లక్షలు, ఐసిడిఎస్ నుంచి రూ.2 లక్షలు, జిల్లా పరిషత్ నిధులు రూ.2.50 లక్షలు వెరసి రూ.9.50 లక్షల నిధులు గతేడాది విడుదలయ్యాయి. సర్పంచి పసుపులేటి నరసింహరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఎల్ఎ ధర్మరాజు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని కోరారు. తహశీల్దారు పి.సతీష్, చేబ్రోలు సెక్టారు సూపర్‌వైజర్ శారదామణి, నాయకులు కడియాల రవిశంకర్, పాతూరి విజయ్ కుమార్, అంగన్‌వాడీలు, జనసేన, టిడిపి కార్యకర్తలు, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ ధర్మరాజు

నేడు ఎపి 6వ స్నాతకోత్సవం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం నిట్ 6వ స్నాతకోత్సవం ఆ ప్రాంగణంలోని రవీంద్ర కళాభారతి ఆడిటోరియంలో ఈ నెల 17వ తేదీ మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ నిర్వహించే వేడుకకు అధికారులు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు ఇన్‌ఛార్జి డైరెక్టర్ బిఎస్ఎన్.మూర్తి తెలిపారు. 2020 - 24లో బిటెక్ నాలుగేళ్ల ఇంజినీరింగ్ కోర్సును పూర్తి చేసుకున్న 527 మంది విద్యార్థులకు (బాలురు 405, బాలికలు 122) డిగ్రీలు అందజేయనున్నారు. వీరితోపాటు రెండేళ్ల ఎంటెక్ కోర్సు పూర్తి చేసిన 15 మంది విద్యార్థులకు డిగ్రీలు, 25 మంది పరిశోధనా విద్యార్థులకు డాక్టరేట్ పట్టాలను ప్రదానం చేయనున్నారు. సంస్థల్లో మొత్తం కోర్సులు నిర్వహిస్తుండగా ఆయా కోర్సుల్లో అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన ఒక్కో విద్యార్థి చొప్పున 8 మందికి, బ్యాచ్‌ల వారీగా అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థికి ఇనిస్టిట్యూట్ తరపున బంగారు పతకాలను అందజేయనున్నారు. ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ బిఎస్. మూర్తి అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమానికి హిమాచల్ ప్రదేశ్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ ఛైర్మన్, ఐఐటి అల్యూమినీ కౌన్సిల్ ప్రెసిడెంట్ డాక్టర్ రవిశర్మ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. నిట్ డైరెక్టర్ ఇనిస్టిట్యూట్ ప్రోగ్రెస్ రిపోర్ట్‌ను అందజేయనున్నారు. కోర్సులవారీగా అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులు బంగారు పతకాలను అందుకోనున్నారు.

అన్ని గ్రామాలనూ ఆదర్శంగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మండలంలోని వెంప గ్రామంలో సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ శుక్రవారం పర్యటించారు. ముందుగా పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం కనక ముత్యాల అమ్మవారిని దర్శించుకున్నారు. తరువాత వెంప సొసైటీ ఏర్పాటు చేసిన సూపర్ మార్కెట్‌ను, సొసైటీని, సచివాలయాన్ని ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో కొన్ని గ్రామాలు మాత్రమే ఆదర్శ గ్రామాలుగా ఎంపికవుతున్నాయని వెల్లడించారు. అయితే ప్రతి గ్రామమూ ఆదర్శ గ్రామంగా ఉండాలని, తాను కోరుకుంటూ ముంబై యూనివర్సిటీలో పిహెచ్‌డి చేస్తున్నానని తెలిపారు. ఈ నేపథ్యంలో అటు తెలంగాణ, ఇటు ఆంధ్రప్రదేశ్‌లో ఎంపికైన ఆదర్శ గ్రామాల్లో కొన్ని సందర్శించి అక్కడ పరిస్థితులను తెలుసుకుని వాటిపై నివేదికను తయారుచేసి ముంబై యూనివర్సిటీ కి, ప్రభుత్వాలకు పంపడం జరుగుతుందని అన్నారు. భీమవరం మండలంలోని వెంప, చిన అమిరం, కాళ్ల మండలంలోని, పాతాళమెరక, కృష్ణా జిల్లాలో తాడినాడ గ్రామాలను సందర్శించి అక్కడి ప్రజల ద్వారా వివరాలు సేకరించి నివేదిక తయారు చేస్తానని పేర్కొన్నారు.

కరాటే నేర్చుకోవాలి

ఫైరాఫీసర్ జి.నాగరాజు

ప్రజాశక్తి - భీమడోలు

ఆత్మ విశ్వాసం పెరగడానికి, రక్షణకు సహకరించే కరాటేను నేర్చుకోవాలని, ముఖ్యంగా విద్యార్థినులు ఈ విషయమై ఇతరులకు ఆదర్శంగా ఉండాలని భీమడోలు ఫైరాఫీసర్ జి.నాగరాజు అన్నారు. భీమడోలు శ్రీ మాధురి జూనియర్ కళాశాల వేదికగా జపాన్ షొటోకాన్ కరాటే డు కన్నిన్ జు (ఇండియా)కు చెందిన ఎపి చీఫ్ షిహాన్ డివిఎల్.నారాయణ, కరాటే మాస్టారు ఎం.సతీష్ కుమార్ ఆధ్వర్యంలో బెల్ట్ టెస్ట్ పోటీలను శుక్రవారం నిర్వహించారు. పోటీల్లో 25 మంది వరకు విద్యార్థులు పాల్గొన్నారు. వారు ప్రదర్శించిన స్థాయిల ఆధారంగా ఎల్లో బెల్ట్, బ్లూ బెల్ట్, పర్పుల్ బెల్ట్, బ్రౌన్ బెల్ట్‌లను కార్యక్రమంలో పాల్గొన్న అతిథుల చేతులు మీదుగా అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ పి.బాలు, ప్రముఖులు వెజ్జు ధర్మారావు, ఇతరులు పాల్గొన్నారు.

విజేతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఫైరాఫీసర్ నాగరాజు

యువతకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్థానిక డిఎల్‌టిసి ప్రధానాచార్యుడు ఎస్.ఉగాదిరవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన కింద ఆఫీస్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్, ఫీల్డ్ టెక్నీషియన్ హోమ్ అప్లయెన్సెస్ కోర్సుల్లో మూడు నెలలపాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి, ఆపై ఉత్తీర్ణులైన వారు 15 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులని ఆయన తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 30వ తేదీ తుదిగడువుగా పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నెం.9493482414కు కాల్ చేసి సంప్రదించాలని తెలిపారు.

మంత్రి పార్థసారధికి నాగలి బహూకరణ

ప్రజాశక్తి - ముసునూరు

మంత్రి పార్థసారధికి టిడిపి ముసునూరు మండల నాయకులు నాగలి బహూకరించారు. మండలంలో విద్యుత్ సరఫరా సమస్యలు లేకుండా చూడాలని, సాగునీరు, తాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని వారు కోరారు. నూజివీడులో అన్నకాంటీన్‌ను మంత్రి పార్థసారధి శుక్రవారం ప్రారంభించారు. టిడిపి ముసునూరు మండల నాయకులు దేవినేని ధులరామ్, గద్దె రఘుబాబు, సూర్యదేవర శ్రీనివాసరావు, లక్కపాము కాంతారావు, గరికముక్కు, నాని, మానం రాంబాబు, తమ్మల నాగేశ్వరరావు, మధు, మెదరమెట్ల సురేంద్రతో పాటు పలువురు నూజివీడు వెళ్లి ఆయనకు నాగలి బహూకరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముసునూరు మండలానికి విద్యుత్ సరఫరా సమస్యలు లేకుండా చూడాలని, సాగునీరు, తాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని మంత్రిని కోరారు.

సురేష్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం మాజీ సర్పంచి గుణ్ణం రామచంద్రరావు జ్ఞాపకార్థం ఛారిటబుల్ ట్రస్టు ప్రారంభించి పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న తనయుడు గుణ్ణం సురేష్‌ను పలువురు అభినందించారు. సురేష్ (రిచీ) పుట్టిన రోజు సందర్భంగా ఆయన తండ్రి పేరిట గుణ్ణం రామచంద్రరావు (జిఆర్‌సిటి) ఛారిటబుల్ ట్రస్టు ప్రారంభించి శుక్రవారం రక్తదాన శిబిరాలు నిర్వహించారు. నారాయణపురం ఆరోగ్య ఉపకేంద్రంలో ఆశా వర్కర్లకు గొడుగులు, వాటర్ బాటిల్స్ అందించారు. ఎయిడ్స్ రోగులకు 30 మందికి ప్రొటీన్‌ఫుడ్, ఉంగుటూరు అనాథాశ్రమంలో పిల్లలకు నెలకి సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. చేబ్రోలు అనాథాశ్రమం పిల్లలకు క్రికెట్, వాలీబాల్ కిట్స్ అందించారు. చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వృద్ధులకు పండ్లు, పాలు అందించారు. నారాయణపురం పంచాయతీ పారిశుద్య కార్మికులకు రెయిన్ కోట్స్ ఇచ్చారు. స్థానిక అరుంధతీయులకాలనీలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి మెట్ల రైలింగ్ ఏర్పాటు చేశారు. సురేష్‌కు చెందిన తోటలో పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. వేలాది మంది అభిమానులు, జనసేన, రాజకీయ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, విశ్రాంత ఉద్యోగులు సురేష్‌ను అభినందించారు.

పలువురు పంచాయతీ కార్యదర్శులు బదిలీ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని పలువురు పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేసినట్లు ఎంపిడిఒ కెవిఎం.మంగతాయారు తెలిపారు. కామయ్యపాలెం కార్యదర్శి యు.దేవప్రియకు గ్రేడ్-3 నుంచి గ్రేడ్-2 పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగోన్నతి పొంది బుట్టాయగూడెం మండలం బుట్టాయగూడెం గ్రామపంచాయతీకి బదిలీ అయినట్లు చెప్పారు. ధర్మగూడెం కార్యదర్శి జె.సుబ్రహ్మణ్యం గ్రేడ్-3 నుంచి గ్రేడ్-2 కార్యదర్శిగా ఉద్యోగోన్నతి పొంది చాట్రాయి మండలం పోతనపల్లి బదిలీ అయినట్లు తెలిపారు. మండలంలోని ఎనిమిది మంది సచివాలయ కార్యదర్శులను డిడిఒలుగా ఇతర మండలాలకు బదిలీపై వెళ్లినట్లు ఆమె తెలిపారు.

చింతలపూడి పాత బస్టాండ్ వద్ద ధర్నా చేస్తున్న దళిత నాయకులు

ఎస్‌సి వర్గీకరణను వ్యతిరేకిస్తూ ధర్నా

ప్రజాశక్తి - చింతలపూడి

ఎస్‌సి వర్గీకరణను వ్యతిరేకిస్తూ చింతలపూడి పాత బస్టాండ్ వద్ద మాలల జెఎసి ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమన్నారు. సుప్రీంకోర్టు తీర్పు దళితులను తీవ్ర నిరాశకు గురి చేసిందన్నారు. కేంద్ర, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ అనుకూల ప్రకటనలను ఖండించాయన్నారు. దళితులు ఐక్యంగా లేకపోవడం వల్లే వివిధ పార్టీలు వర్గీకరణ చేస్తామని మాటలు ఇస్తున్నాయన్నారు. వర్గీకరణకు రాజకీయ కారణాలే తప్ప సామాజిక కారణాలు లేవన్నారు. వర్గీకరణను ఏజెండాగా తీసుకున్న పార్టీలకు మాలల సత్తా చూపిస్తామన్నారు. భవిష్యత్తులో జరిగే పోరాటాలకు ప్రతి ఒక్కరూ సిద్ధపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిట్ట వేణు, కాకర్ల సత్యనారాయణ, కలుకుర్తి నాగేశ్వరరావు, సరిపల్లి వెంకటేశ్వరరావు, తొర్లపాటి బాబు, గొందిరాజు, మానేపల్లి రాజారావు, జైపాల్, రాజారత్నం, బేతు మహాలక్ష్ముడు, వెంకన్న బాబు, దిలీప్, జైపాల్, రాజారత్నం, వీరేంద్ర పాల్గొన్నారు.

చింతలపూడి : వర్గీకరణ వద్దు ఐక్యత ముద్దు అని దళిత ఐక్యత నాయకులు అన్నారు. ఈ మేరకు వారు చింతలపూడి నగర పంచాయతీ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రద్దు చేయాలని కోరారు.

రోడ్లకు మరమ్మతులు చేయాలి : సిపిఐ

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

ఇటీవల వరదలకు కొట్టుకుపోయిన రోడ్ల మరమ్మతులపై సంబంధిత అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని మేడేపల్లి నుంచి రుద్రంకోట, కోయిదా వరకు వరదలకు కొట్టుకుపోయిన రహదారులను శుక్రవారం సిపిఐ పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి కారం దారయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు, మండల కార్యదర్శి బాడిశ రాము పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొట్టుకుపోయిన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలని ప్రభుత్వం అధికారులకు ఆదేశాల ఇవ్వటంతో మండలంలో ఉన్న కొంతమంది గుత్తేదారులు రోడ్డు కాంట్రాక్ట్ పనులు చేశారన్నారు. రహదారికి పనికిరాని మట్టిని పైన పోసి బిల్లులు చేయించుకోవాలని చూస్తున్నారన్నారు. సంబంధిత ఎఇ, డిఇలు పర్యవేక్షించకపోవడం సరికాదన్నారు. వేలేరుపాడు ప్రధాన కూడలిలో రోడ్డు గత ప్రభుత్వంలో మంజూరైందని, అప్పటి కాంట్రాక్టర్ అధికారులతో కుమ్మక్కై రహదారి నిర్మించకుండానే బిల్లులు చేయించుకున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం మారిన వెంటనే హడావుడిగా తారు రోడ్డు నిర్మాణం చేపట్టారని, అది ఇటీవల వచ్చిన వర్షం వరదకు పోయిందన్నారు. సరైన విధానంతో రహదారులు నిర్మించనివారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికైనా అధికారులు ఆ రోడ్లన్నీ పరిశీలించాలన్నారు.

నేరాలు - ఘోరాలు

భర్తను చంపిన భార్య

ప్రజాశక్తి - ఉంగుటూరు

భార్యాభర్తల మధ్య తగాదాల నేపథ్యంలో గునపంతో భర్తపై భార్య దాడి చేయగా భర్త మరణించాడు. ఈ ఘటన నిడమర్రు మండలం పెదనిండ్రకొలను జగనన్న కాలనీలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అత్తిలి మండలం వృదాళ్లపాలేనికి చెందిన ఏనుగుపల్లి శ్రీను(42) ఆయన భార్య ఝాన్సీరాణి సుమారు 20 ఏళ్ల నుంచి పెదనిండ్రకొలనులోనే ఉంటున్నారు. జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకుని రెండు వారాల క్రితమే నివాసం వచ్చారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం భార్యాభర్తలు గొడవపడ్డారు. ఈ క్రమంలో భర్తపై భార్య గునపంతో దాడి చేయడంతో ఆయన మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు.

ప్రగడవరంలో చోరీ

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని ప్రగడవరంలో పట్టపగలు చోరీ జరిగింది. ప్రగడవరానికి చెందిన కలదండి వెంకటాచారి కుటుంబ సమేతంగా శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా ఉదయం పది గంటలకు ఆలయానికి వెళ్లారు. తిరిగి మధ్యాహ్నం ఒంటి గంటకు వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. రూ.60 వేల నగదు, రెండు కాసుల బంగారం అపహరణకు గురయ్యాయని బాధితులు వాపోతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నాటుసారా స్థావరంపై దాడి

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని జనార్ధనవరం గ్రామంలో సారా స్థావరంపై నూజివీడు రూరల్ ఎస్ఐ రామకృష్ణ, చాట్రాయి ఎస్ఐ స్వామి తమ సిబ్బందితో శుక్రవారం దాడి చేశారు. ఈ దాడిలో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 15 లీటర్ల నాటుసారా, 30 ప్లాస్టిక్ డ్రమ్ములు, ఆరు గ్యాస్ బండలు స్వాధీనం చేసుకున్నారు. ఐదు వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ఆక్రమణలో ముత్యాలమ్మ తల్లి చెరువు..!

రక్షించాలని ఎర్రగుంటపల్లి వాసుల వేడుకోలు

పట్టించుకోని అధికారులు

చెరువును ఆక్రమించి సాగు చేస్తున్న వరి

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామంలో సుమారు 34 ఎకరాల విస్తీర్ణంలో సుమారు 200 ఎకరాలకు సాగునీరందించే చెరువు ఆక్రమణకు గురైంది. గ్రామంలోని ముత్యాలమ్మ తల్లి చెరువును కొంతమంది ఆక్రమణదారులు ఆక్రమించి పంటలు సాగు చేసుకుంటున్నారని, మరికొంతమంది ఏకంగా పామాయిల్ మొక్కలు వేసుకున్నారని స్థానికులు చెబుతున్నారు. అంతే కాకుండా చెరువు భూమిని పట్టా చేసుకున్నట్లు వారు చెబుతున్నారు. ఇదే చెరువులో ఉపాధి హామీ పనులు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అసలే చెరువే లేకుండా ఉపాధి హామీ పనులు ఎలా చేయించాలని పలువురు ప్రశ్నిస్తున్నారు. అసలు ఉపాధి హామీ పనులు చేస్తున్నారా లేక చేసినట్లు బిల్లులు పెడుతున్నారా అని ఉన్నతాధికారులు వాస్తవాలు బయటకు తీయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఎవరి లబ్ధి కోసం ఈ విధంగా చేస్తున్నారో తేల్చాలని కోరుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేయించాలని, చెరువును ఆక్రమణల నుంచి రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడంలేదు
పిడమర్తి ముత్తారెడ్డి, యర్రగుంటపల్లి

గతంలో అనేక మార్లు స్పందనలో ఫిర్యాదు చేశాను. కాని ఎవరూ పట్టించుకోని పరిస్థితి. అధికారులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. చెరువు ఉంటే ఎంతోమంది రైతులకు సాగునీటికి ఉపయోగపడుతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ఆక్రమణకు గురైన చెరువును రక్షించాలి. కోరుకుంటున్నాం.

ఆక్రమణల గురించి తెలుసుకుంటాను
పుల్లారావు, ఎర్రగుంటపల్లి విఆర్ఒ

ముత్యాలమ్మ చెరువు కింద సుమారు 200 ఎకరాలు సాగునీటి పంటలు ఉన్నాయి. నేను ఇటీవల విఆర్‌ఒగా వచ్చాను. ఆక్రమణల గురించి తెలుసుకుంటాను.

ఉపాధి హామీ పనులు చేయించాం
మోహినికుమారి, ఎపిఒ

ముత్యాలమ్మ చెరువులో ఉపాధి హామీ పనులు చేయించాం. 2024 మార్చిలో కూడా పనులు చేయించాం.

మహిళలకు రక్షణ కల్పించాలి

జూనియర్ డాక్టర్ హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామల, యామిని

ఏలూరు సిటీ : నిరసన తెలుపుతున్న వైద్యులు, విద్యార్థులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మహిళలపై జరుగుతున్న దాడులు, హత్యల నుంచి రక్షణ కల్పించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వరక శ్యామల, మన్నవ యామిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతా ఆర్‌జి కార్ వైద్య కళాశాల ఆసుపత్రిలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ట్రెయినీ వైద్యురాలిపై హత్యాచార ఘటనను తీవ్రంగా ఖండించారు. హత్యాచార ఘటనకు కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జరిగిన పరిస్థితులను బట్టి పరిశీలిస్తే స్థానిక ప్రభుత్వ యంత్రాంగం నిందితులను కాపాడే ప్రయత్నం చేస్తుందన్నారు. హేయమైన నేరానికి పాల్పడిన వారిని కాపాడేందుకు జరుగుతున్న ప్రయత్నాలతో సంబంధిత ఆసుపత్రి, స్థానిక యంత్రాంగంపై అనేక అనుమానాలు వస్తున్నాయని తెలిపారు. ఈ ఘటన మహిళా వైద్యుల్లో అభద్రతా భావాన్ని పెంచిందన్నారు. కళాశాలల్లోని వైద్యులకు రక్షణ లేకపోతే ఉన్నత చదువుల కోసం తమ కుమార్తెలను తల్లిదండ్రులు బయటకు ఎలా పంపగలరని ప్రశ్నించారు. నిర్భయ చట్టం అమల్లోకి వచ్చినా ఇటువంటి దురాగతాలను, నేరాలను ప్రభుత్వ యంత్రాంగాలు ఎందుకు నియంత్రించలేకపోతున్నాయని ప్రశ్నించారు. మహిళలపై పెరుగుతున్న ఆకృత్యాల మీద నిర్ణయాత్మక చర్యలకు సమాజంలో ప్రతివర్గం, అన్ని పార్టీలు దృష్టిపెట్టడం, చర్చించడం అవసరమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని స్థానిక ప్రభుత్వ యంత్రాంగం బాధిత కుటుంబానికి అండగా నిలిచి వారికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. సమాజానికి గుణపాఠం లభించేలా నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఏలూరు సిటీ : కోల్‌కతాలో ట్రెయినీ వైద్యురాలి హత్యాచారాన్ని నిరసిస్తూ డిఎంహెచ్ఒ కార్యాలయం ఎదుట వైద్యులు, మెడికల్ కళాశాల విద్యార్థులు శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసులో సత్వర న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ఆసుపత్రుల్లో డ్యూటీలో ఉన్న మహిళ వైద్యులకు, వైద్య సిబ్బందికి తగిన రక్షణ కల్పించే వ్యవస్థ తీసుకురావాలన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

దొరమామిడి నంచి అలివేరు వెళ్లే రోడ్డుకు అంతర్వేదిగూడెం ఎంపిటిసి సభ్యులు కొవ్వాసు గోవిందరాజు, అలివేరు పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ చింతల కృష్ణ, అలివేరు గ్రామ ప్రజల సహకారంతో మరమ్మతులు చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు పాడైపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ రోడ్డుకు శుక్రవారం మరమ్మతులు చేశారు. ఈ సందర్భంగా ఎంపిటిసి గోవిందరాజు మాట్లాడుతూ ఏజెన్సీ వ్యాప్తంగా పాడైపోయిన రోడ్లకు అధికారులు మరమ్మతులు చేయాలన్నారు. పలుచోట్ల రోడ్లు నిర్మించాలని కోరారు.

ముదినేపల్లిలో సర్దార్ గౌతు లచ్చన్న జయంతి

ప్రజాశక్తి- ముదినేపల్లి

ముదినేపల్లిలోని గురజ రోడ్డులో స్వాతంత్ర సమర యోధులు, బడుగు,బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న 115వ జయంతి వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌ఛార్జి కొడాలి వినోద్ ఆధ్వర్యంలో గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వినోద్ మజ్జిగ పంపిణీ చేశారు.

'అన్న కాంటీన్లు మండల కేంద్రాల్లో ఏర్పాటు చేయాలి'

ప్రజాశక్తి - మండవల్లి

అన్న క్యాంటీన్లను మండల కేంద్రాల్లో కూడా ఏర్పాటు చేసి పేదల ఆకలి తీర్చేవిధంగా చర్యలు తీసుకోవాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు భాస్కరరావు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నార్తుల ఆకలిని తీర్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి అన్న క్యాంటీన్ ప్రారంభించడం హర్షణీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనే పేద ప్రజలు ఎక్కువగా ఉంటారని, మండల కేంద్రాల్లో కూడా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని కోరారు.

డ్రెయినేజీ పూడిక తీత

ప్రజాశక్తి - ముసునూరు

ప్రజలు అనారోగ్యానికి గురి కాకుండా చర్యలు తీసుకుంటున్నామని కాట్రేనిపాడు సర్పంచి గద్దల సుహాసినిమోహన్‌రావు అన్నారు. డ్రెయినేజీలో పూడిక తీయిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ఉన్న అన్ని మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించి మెరుగుపరిచే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

ఎన్‌టిఆర్ విగ్రహ ఏర్పాటు పనులు ప్రారంభం

ప్రజాశక్తి - కుక్కునూరు

మండల కేంద్రమైన కుక్కునూరులో కీర్తిశేషులు నందమూరి తారక రామారావు విగ్రహ ఏర్పాటుకు శుక్రవారం పనులు ప్రారంభమయ్యాయి. టిడిపి కుక్కునూరు మండలాధ్యక్షుడు మొలిశెట్టి నాగేశ్వరరావు, సొసైటీ మాజీ అధ్యక్షులు కోటగిరి సత్యనారాయణ, ఉప సర్పంచి పిచ్చుక రాజు పర్యవేక్షణలో బేస్‌మెంట్ పనుల ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

పాఠశాలకు కంప్యూటర్లు అందజేత

ప్రజాశక్తి - మండవల్లి

పూర్వ విద్యార్థులు అందిస్తున్న సౌకర్యాలను అందిపుచ్చుకుని విద్యలో మరింత రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎంఇఒ-2 రత్నసునాదం అన్నారు. మండలంలోని భైరవపట్నం ఎంపియుపి పాఠశాలకు పూర్వ విద్యార్థి దాసరి సనాతన సుమారు రూ.60 వేల ఆర్థిక సహాయంతో అందించిన కంప్యూటర్లను ఆమె చేతులమీదుగా శుక్రవారం పాఠశాలకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థులు విద్యలో మరింత అభివృద్ధి చెందాలని పూర్వ విద్యార్థులు కాంక్షించడం ఎంతో సంతోషకరమన్నారు. నేటి కాలంలో కంప్యూటర్ విద్య ఎంతో అవసరమని గమనించి కంప్యూటర్లను వితరణగా అందించడం అభినందనీయమన్నారు. అనంతరం నాలుగు కంప్యూటర్లను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యానికి అందించారు. సనాతనను అభినందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఎన్.రాధానాగేంద్ర, ఎంపిటిసి సభ్యులు కిరీటి రాజు పాల్గొన్నారు.

పోలీస్ సభ్యులకు రుణాలు

జీతం నుంచి మినహాయింపు

పోలీస్ కో-ఆపరేటివ్ సొసైటీ భవనం ప్రారంభంలో ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు

పోలీస్ కో-ఆపరేటివ్ సొసైటీ భవనాన్ని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీస్ సభ్యులందరికీ క్రమపద్ధతిలో రుణాలు మంజూరు చేస్తూ ప్రతి నెలా వారి జీతం నుంచి మినహాయింపు చేయనున్నట్లు చెప్పారు. జిల్లా హోమ్ గార్డులు ఎస్‌పిని కలిసి వారికి ఈ కో-ఆపరేటివ్ సొసైటీలో సభ్యత్వం కల్పించి వారికి కూడా ఒక్కొక్కరికి రూ.రెండు లక్షలు రుణం మంజూరు చేయాలని కోరారు. ఎస్‌పి సానుకూలంగా స్పందించి సాధ్యాసాధ్యాలను పరిశీలన చేసిన తర్వాత దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి స్వరూపరాణి, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు, ఎఆర్ అదనపు ఎస్‌పి ఎన్‌ఎస్‌ఎస్.శేఖర్, ఆంధ్రప్రదేశ్ పోలీస్ హౌసింగ్ బోర్డు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షేక్ అబ్దుల్ ఖాదీర్, ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్, ఎఆర్ డిఎస్‌పి శ్రీహరి, ఎస్‌ఇబి ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, ఏలూరు టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్, ఏలూరు త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఆర్ఐ పవన్‌కుమార్, కో-ఆపరేటివ్ సెక్రటరీ ఆర్‌ఎస్ఐ సత్యనారాయణ, కో-ఆపరేటివ్ సొసైటీ ఆఫీసర్ అకౌంటెంట్ ఎమ్‌డి అబ్దుల్ అలీమ్, ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ కృష్ణంరాజు, కో-ఆపరేటివ్ సెక్రటరీ ఎఆర్ ఎస్ఐ శ్రీనివాసరావు, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు, శానం రమేష్‌బాబు, ఎస్ఐ కె.రాంబాబు, ఆర్‌ఎస్ఐ నరేంద్ర, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హమాలీలకు ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలి

ఐఎఫ్‌టియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

దేశవ్యాప్తంగా రైల్వే గూడ్స్ షెడ్‌లో లోడింగ్ అన్ లోడింగ్ హమాలీ కార్మికులుగా పని చేస్తున్న వారికి ఇఎస్ఐ, పిఎఫ్ వంటి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని ఐఎఫ్‌టియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏలూరు రైల్వే గూడ్స్ షెడ్ ఆవరణలో శుక్రవారం జరిగిన గూడ్స్ షెడ్ లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో వెంకట్రావు మాట్లాడారు. దేశవ్యాప్తంగా రమారమీగా అసంఘటిత కార్మిక రంగం, హమాలీ రంగం నాలుగు కోట్ల పైబడి ఉన్నారని, వారికి కనీస సౌకర్యాలు, సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం హమాలీ కార్మికులకు ఉపాధి భద్రతతో కూడిన చట్టం వచ్చేవరకు సమరశీల పోరాటాలకు కార్మిక వర్గం సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్మిక వర్గం కోసం ఏర్పడిన సంక్షేమ బోర్డులను పరిరక్షించే విధంగా ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసంఘటిత కార్మిక రంగానికి పని భద్రత కల్పించే విధంగా బీమా వంటి భద్రత సౌకర్యాలు తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టియు ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి గడసాల రాంబాబు, ఎపి ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం నగర అధ్యక్షులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చిరంజీవి యువత ఉమ్మడి కృష్ణాజిల్లా జాయింట్ సెక్రటరీగా సుధీర్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

చిరంజీవి యువత ఉమ్మడి కృష్ణాజిల్లా జాయింట్ సెక్రటరీగా సత్రపు సుధీర్ నియమితులయ్యారు. మెగా ఫ్యామిలీ అభిమాన సంఘాల్లో కీలకమైన చిరంజీవి యువత నూతన కమిటీలను రాష్ట్ర చిరంజీవి యువత నాయకులు ప్రకటించారు. గత మూడేళ్లుగా నూజివీడు నియోజకవర్గ చిరంజీవి యువత అధ్యక్షులుగా రంజీవి యువతను ముందుకు తీసుకెళ్లడంలో, మెగా ఫ్యామిలీ పుట్టినరోజు వేడుకలు, కరోనా సమయంలో అభిమానులకు, ప్రజలకు చిరంజీవి యువత తరపున ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిన సత్రపు సుధీర్ సేవలను అఖిల భారత చిరంజీవి యువత గౌరవాధ్యక్షులు మెగా బ్రదర్ నాగబాబు గుర్తించారు. సుధీర్‌ను చిరంజీవి యువత ఉమ్మడి కృష్ణాజిల్లా జాయింట్ సెక్రటరీగా నియమించారు. ఈ సందర్భంగా సత్రపు సుధీర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి నియోజకవర్గ స్థాయి నుంచి జిల్లా స్థాయిలో హోదా ఇచ్చినందుకు చిరంజీవి యువత నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనకు అప్పజెప్పిన బాధ్యతకు పూర్తిస్థాయిలో న్యాయం చేసి జిల్లా స్థాయిలో మెగా ఫ్యామిలీ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తానని తెలిపారు.

మొరాయించిన చేపల లోడు లారీ

స్తంభించిన ట్రాఫిక్

ఆగిపోయిన లారీ ఇదే..

ప్రజాశక్తి - ఉంగుటూరు

విజయవాడ - విశాఖ రైలు మార్గం ఉంగుటూరు మండలం చేబ్రోలు వద్ద శుక్రవారం రాత్రి చేపల లోడు లారీ గేర్ పట్టేయడంతో పట్టాల మధ్యలో ఆగి పోయింది. స్థానికులు సహకారంతో లారీని బయటకు నెట్టారు. అదే సమయంలో ఈ మార్గంలో పలు రైళ్లు వెళ్లాల్సి ఉంది. గోపీనాథపట్నం నుంచి ఢిల్లీకి చేపల లోడుతో బయ లుదేరిన లారీ పట్టాల మధ్యలో గేర్ బాక్స్‌లో సాంకేతిక సమస్య కారణంగా ఆగిపోయింది. లారీని బయటకు తీసుకొచ్చేందుకు స్థానికులు ఎంతో శ్రమించారు. సుమారు 10 నుంచి 15 నిమిషాల పాటు గేటుకు ఇరు పక్కల లారీలు, కారులు ఇతర వాహనాలు నిలిచిపోయాయి.

మురుగు నీటిలో విద్యార్థుల అవస్థలు

పట్టించుకోని అధికారులు

మురుగునీటిలో పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని బొర్రంపాలెం గ్రామంలో హైస్కూల్ పక్కన ఉన్న విద్యార్థులు, గ్రామస్తులకు మురుగునీటిలో అవస్థలు తప్పడంలేదు. స్థానికంగా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం, మురుగునీరు పోయేందుకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో వర్షాలకు నీరు రోడ్డు పైనే ఉండిపోతుంది. అంతేకాకుండా ఎక్కువరోజులు నిల్వ ఉండడంతో మురుగు నీరుగా ఏర్పడుతుంది. మురుగు నీరు వల్ల దోమలు ప్రబలుతున్నాయని, దీంతో అనారోగ్యాలు వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో నుంచి పాఠశాలకు వెళ్లాలంటే విద్యార్థులకు ఇదే దారి కావడంతో చేసేదిలేక మురుగునీటిలో నుంచి నడచి వెళ్లాల్సి వస్తోందని, గ్రామస్తులు కూడా సెంటర్‌కు వెళ్లాలన్నా నీటి నిల్వలు వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేసి నీటి నిల్వలు లేకుండా చూడాలని, ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

ఉత్తమ ఎఎన్ఎంగా ఎలీనారాణి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ముదినేపల్లి-2 ఎఎన్ఎంగా పనిచేస్తున్న నిమ్మగడ్డ ఎలీనారాణి ఉత్తమ ఎఎన్ఎంగా అవార్డు అందుకున్నారు. ఉత్తమ వైద్య సేవలను అందిస్తూ విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచినందుకు ఆమెకు ఈ అవార్డు లభించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏలూరులో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పార్థసారధి ఈ అవార్డును ఎలీనారాణికి అందించారు. కలెక్టర్ వెట్రిసెల్వి ఎఎన్ఎంను అభినందించారు. ఈ సందర్భంగా ఎలీనారాణిని పిహెచ్‌సి వైద్యులు శాంతిశ్రీ, శ్వేత, పిహెచ్‌సి సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - పెదపాడు

పెదపాడు సెక్షన్ పరిధిలోని 33/11 కెవి పెదపాడు సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 17వ తేదీ శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జెపిబి.నటరాజన్ తెలిపారు. ఆ సమయంలో పెదపాడు సబ్‌స్టేషన్ పరిధిలోని పెదపాడు, గుడిపాడు, సత్యవోలు, సకల కొత్తపల్లి, వడ్డిగుడెం, కొణికి, గోగుంట, నాయుడుగుడెం, వసంతవాడ, తోటగుడెం, పునుకొల్లు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా గణపవరం మండలం ముగ్గుళ్ల గ్రామ కాపురస్తులైన ఎలమంచిలి వెంకటలక్ష్మి భర్త వెంకన్న అను నేను నా యొక్క పాస్ పోర్ట్ గణపవరం SBI సెంటర్లో జిరాక్స్ తీయించుకుని మా గ్రామంకు వెళ్లే మార్గ మధ్యలో పాస్ పోర్ట్ నెంబర్ x1049505 పాస్ పోర్ట్ మరియు జిరాక్స్‌తో సహా కవర్లో పెట్టుకుని బండికి తగిలించి వెళ్లే మార్గ మధ్యలో ఎక్కడ పడిపోయిందో తెలియదు ఎంత వెతికిన దొరిక లేదు దొరికినవారు ఈ కింది నెంబర్ కు తెలియజేయగలరు .

ఎలమంచిలి వెంకటలక్ష్మి, భర్త వెంకన్న
ముగ్గుళ్ల గ్రామం, గణపవరం మండలం
పశ్చిమగోదావరి జిల్లా. సెల్ 9347747643

మహారాజశ్రీ భీమవరం 1st అడిషనల్ సివిల్ Judge (జూనియర్ డివిజన్) మరియు 1st క్లాసు మేజిస్ట్రేట్ వారి కోర్టులో

ఓ.ఎస్.55/2024, ఐ.ఎ.76/2024

వాది : ఇమ్మిడి సత్య సూర్య వెంకట నరసింహం.
ప్రతివాదులు : 1.కోపర్తి సూర్య కుమారి, D/o.వెంకటరాజు, డో.నెం.2-78, గొల్లవాని తిప్ప.
2.ఇమ్మిడి నాగ అంకిత్, S/o.I.S.S.V. నరసింహం, వేణుగోపాల స్వామి టెంపుల్ వద్ద, భీమవరం.

Order 5 Rule 20 C.P.C. ప్రకారం 1వ ప్రతివాదికి నోటీసు

పై నెంబర్ ఓ.ఎస్‌లో 1వ ప్రతివాదికు కోర్ట్ వారు ఎన్నిసార్లు సమన్లు పంపిన అమలు జరగనందున కోర్టు వారు దావాను ది.06.09.2024 తేదీకి వాయిదా వేసినారు. కావున 1వ ప్రతివాది పై తేదీన పైకోర్టు వారి ఎదుట ఉదయం 10 గం॥లకు హాజరై మీ సంజాయిషీ తెలుపుకోవలసినది గాను లేని పక్షంలో మీ పరోక్షంలో ఓ.ఎస్, ఐ.ఎ.లు తీర్మానం కాబడునని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

మోగంటి శివకృష్ణ
భీమవరం, వాది తరుపు లాయర్.
ది.17.08.2024 సెల్: 98485 39039

ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ వారి కోర్టులో

ఐ.పి.నెం.14/2024

Between:
ఒసూరి ఫణీంద్ర నరసింహా నాయుడు ...పిటిషనరు
వెర్సెస్
1.అయితం భారత్ సత్యగ్న మవుళ్ళయ్య అరుణ్
2.మేధం రత్న ధనలక్ష్మి హారికా
3.డి.అఫీషియల్ రిసీవర్, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు ...రెస్పాండెంట్లు టు

1వ రెస్పాండెంటు: అయితం భారత్ సత్యగ్న మవుళ్ళయ్య అరుణ్, S/o.కాశీ విశ్వేశ్వరరావు, పురుషుడు, వయస్సు 34, రెసిడెంటు ఆఫ్ ఫ్లాట్ నెం.301, 3వ ఫ్లోర్, జె.ఆర్.అపార్టుమెంట్సు, రాజేంద్ర లైన్స్‌క్లబ్ ఎదుట, బిహేండ్ స్విమింగ్‌పూల్, ఆకెళ్ళవారి వీధి, నరసాపురం-534 275. పశ్చిమ గోదావరి జిల్లా.

పై నెంబరు కేసులో పిటీషనరు పస్తు రెస్పాండెంటుని ఇన్‌సాల్వెంటుగా డిక్లేర్ చేయమని మరియు సెటిల్‌మెంటు డీడ్ తేది.20-1-2024 డాకుమెంటు నెం.404/24ని సెట్ ఎసైడ్ చేయమని పై కోర్టులో ఐ.పి.నెం.14/24 చేయడము జరిగినది. శ్రీకోర్టు వారు 19-08-2024 తేదీన కేసును వాయిదా వేయడము జరిగినది. ఈ ఆస్తిపైన ఎవరైన లావాదేవీలు జరిపిన యెడల అది చట్టప్రకారముగా చెల్లవని తెలియజేయడమైనది.

షెడ్యూలు

అయిటమ్ నెం.1: 38.81 Sq.Yards of 1/8 Undivided joint Right in 310.5 Square Yards.
తూర్పు : అల్లూరి పద్మరాజు గారి తూర్పు కాంపౌండ్ వాలు 40 పీట్
పడమర: మున్సిపల్ రోడ్డు,ఆకెళ్ళ వారి వీధి
ఉత్తరం : ముక్తవరపు గోపి గారి బిల్డింగ్
దక్షిణం : ద్వారా మల్లేశ్వరరావు గారి బిల్డింగ్
అయిటమ్ నెం.2 : 950 Sq.Yards of Plot No. 301.
తూర్పు : ఫ్లాట్ నెం.302 జె.ఆర్.రెసిడెన్సీ
పడమర: ఖాళీ స్థలం
ఉత్తరం : ఖాళీ స్థలం
సౌత్ : ఖాళీ స్థలం

సిహెచ్.యస్.ఆర్.ఆర్.యమ్.బాలాజీ
అడ్వకేటు, నర్సాపురం.